

హైదరాబాద్ వార్త

# మాడభూషి శ్రీధర్‌కు దేవులపల్లి పురస్కారం

**నాంపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త :** ఆధునిక తెలంగాణ వైతాళికుల్లో పేరెన్నికగన్న డా. దేవులపల్లి రామానుజరావు స్మృత్యర్థం నెలకొల్పిన సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది డా. మాఢభూషి శ్రీధర్‌కు ప్రదానం చేయాలని తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్ణయించింది. ఈనెల 25న బొగ్గులకుంటలోని పరిషత్తులో డా. దేవులపల్లి 108వ జయంతిని పురస్కరించుకుని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య సోమవారం తెలిపారు. పురస్కారం కింద 25వేల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. డా. మాఢభూషి శ్రీధర్ సీనియర్ పాత్రికేయుడుగా, కాలమిస్టుగా సుపరిచితులు. కేంద్ర సమాచార కమిషనర్‌గా 25వేల తీర్పులు ఇచ్చారు. 60కిపైగా తెలుగు, ఆంగ్ల రచనలు వెలువరించారు. పలు విశ్వవిద్యాలయాల్లో న్యాయశాస్త్ర ఆచార్యులుగా సేవలందిచారు. ప్రస్తుతం మహేంద్ర న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఉన్నారని చెన్నయ్య వివరించారు.

## సంస్కృత భాషపై పట్టు సాధించండి

**బేగంపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** విద్యార్థులు సంస్కృత భాషను శ్రద్ధగా నేర్చుకోవాలని, సంస్కృత అకాడమీ డైరక్టర్ ఆచార్య మధుసూధన్ హితవు పలికారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సంస్కృత భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నడినెత్తిన యమపాశాలు

**కేబుళ్ల మాటున అక్రమ కనెక్షన్లు**

**కరెంట్ స్తంభాలపై వేలాడుతున్న తీగలు**

**కేబుల్‌టివి, ఇంటర్నెట్, టెలిఫోన్ వైర్లతో నిత్యం ప్రమాదాలు**

**చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న విద్యుత్ అధికారులు**

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** నగరంలో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్న కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ వైర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలపై కేవలం 4 వరుసలతో మాత్రమే కరెంటు తీగలు ఉంటే.. ఆ స్తంభాలపై 20 నుంచి 30 వరుసలతో కూడిన కేబుల్ వైర్లు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇవి ప్రమాదంగా మారుతుండటంతో నగర ప్రజలతో పాటు ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులు తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారానికి విద్యుత్ తీగలు తగిలినప్పుడు మెరుపులు వచ్చి అవి కేబుళ్ల మీద పడి.. మంటలు వస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ప్రధాన రహదారుల మీదే జరుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా

మిగతా 3లో

# మృత్యు రథం

## గోకులే నగర్‌లో కన్నీటి సంద్రం

**శ్రీకృష్ణ శోభాయాత్రలో పెనువిషాదం - ఐదుగురిని మింగేసిన హైటెన్షన్ వైరు**



కన్నీరుమున్నీరవుతున్న మృతుల కుటుంబ సభ్యులు

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రామంతపూర్ గోకులే నగర్ ఐదుగురు యువకులు మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. మృతులు అందరూ కలిసి ఆనందంగా ఉత్సవాల్లో పాల్గొని అకాల మరణానికి గురయ్యారు. శ్రీకృష్ణ శోభాయాత్రలో విద్యుత్ తీగల పైన డిష్ కేబుల్ ద్వారా సంభవించిన విద్యుత్ షాక్ తగిలి రథం కింద ఉన్న ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించగా మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన క్షతగాత్రులు వేర్వేరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో బాగంగా రామంతపూర్ పాతబస్తికి చెందిన సర్వ రవీందర్ యాదవ్ ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆదివారం రామంతపూర్ యాదవ సంఘం నుండి

**మృతులంతా స్నేహితులే** 3లో

**కలిసి జీవనం.. కలిసికట్టుగా 'ఆఖరి ప్రయాణం'**



ప్రమాదానికి కారణమైన రథం

**ప్రభుత్వం, ఉన్నతాధికారులు.. ఎంత మొత్తుకున్నా జరగరాని ఘోరం జరగనే జరిగింది. ఉత్సవాల వేళ ఏ ప్రమాదమూ జరగకూడదని నిత్యం సమీక్షలు.. ఆదేశాలు.. తనిఖీలు.. ఇలా ఎంత హడావుడి చేసినా క్షేత్రస్థాయిలో కొంత మంది నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటోంది. గోఖలే నగర్‌లో ఎప్పటి నుంచో ఉన్న విద్యుత్ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోవడం.. స్థానికులు ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోకపోవడం పెనుముప్పుకు కారణమైంది. ఉత్సవాలకు అనుమతులుండాలని హంగామా చేసే అధికార యంత్రాంగం .. రామంతాపూర్‌లో విద్యుత్ శాఖకు సంబంధించి ఏ మాత్రమూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ఐదు నిండు ప్రాణల ఉసురు తీసిన ఉదంతం స్పష్టం చేస్తోంది.**



సంఘటనా స్థలంలో ధర్నా చేస్తున్న విపక్ష నేతలు, స్థానికులు

# విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై వెల్లువెత్తిన ఆగ్రహం

**స్థానికుల నిరసన**
**సీఎండి నిలదీత**

**నేడు రామంతాపూర్ బంద్‌కు విపక్షాల పిలుపు**

సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన రథయాత్ర ర్యాలీని స్థానిక ప్రజాప్రతి నిధులు భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. డప్పు మేళాలు, కళాకారుల నృత్య ప్రదర్శన మధ్య వైభవోతంగా రథయాత్ర ర్యాలీ ఆర్టీసీ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్,

మిగతా 3లో

**పార్టీ నేతల ధర్నా..**

ఇదిలా ఉండగా ఘటనను నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, సర్వ బాబు యాదవ్, గడ్డం రవికుమార్, బిఆర్ఎస్ మల్కాజిగిరి ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆధ్వర్యంలో స్థానికులు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ నిరక్ష ్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని ఆరోపిస్తూ సంఘటన స్థలాన్ని సందర్శించిన టిఎస్ఎస్ పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫరూక్, హబ్సిగూడ సూపరిండెంట్ ఇంజనీర్ ప్రతిమ సోమ్, డివిజనల్ ఇంజనీర్ సుబ్బారావు అధికారులను నిలదీశారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అధికారులకు ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అడిషనల్ డిసిపి వెంకటరమణ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి, ఎస్సైలు తమ సిబ్బందితో రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింప చేశారు. అనంతరం రామంతపూర్ ప్రధాన రహదారిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఘటన పట్ల మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుకాణాల బంద్ చేసి సంతాపం ప్రకటించారు. రామంతపూర్‌లో జరిగిన విద్యుత్ షాక్‌తో ఐదుగురు యువకులు మరణించడం చాలా బాధాకరమని, విద్యుత్ అధికారుల నిరక్ష ్యం.. అలసత్వం వల్ల జరిగి

మిగతా 3లో

# నటుడు ధర్మ మహేశ్‌పై వరకట్న కేసు

**అదనంగా కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు**

**గచ్చిబౌలి, ఆగస్టు 18 ప్రభాతవార్త :** ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న సినీనటుడు ధర్మ మహేశ్ మీద గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధిం చిన వివరాలు



బాధితురాలి కథనం ప్రకారం.. సింధూరం, డ్రింకర్ సాయి వంటి సినీమాల్లో హీరోగా నటించిన ధర్మ మహేశ్ అలియాస్ కాకాని ధర్మ సత్య సాయి శ్రీనివాస మహేశ్(30) మాదాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. 2013లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గౌతమి(31)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారగా, ఇద్దరు 2019లో వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. గౌతమి, ఆమె తండ్రి చేసిన ఆర్థిక సహాయంతో ధర్మ మహేశ్, గౌతమిలు కలిసి ఓ ఫుడ్ ఫ్రాంచైజీ బిజినెస్ ప్రారంభించారు. కాగా ఈమధ్య కాలంలో సినీమాల్లో అవకాశాలు పెరుగడంతో ధర్మ మహేశ్ ప్రవర్తన మారిపోయింది. జల్సాలు, షికార్లతో భార్య, కుమారుడిని పట్టించుకోవడం లేదు. దీనిపై గౌతమి నిలదీయగా, ప్రస్తుతం తన స్టేటస్ మారిందని, తనకు అదనపు కట్నం కావాలంటూ వేదింపులకు పాల్పడసాగాడు. వ్యాపారాన్ని సైతం హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండడం, ధర్మ మహేశ్, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తుండడంతో తాజాగా గౌతమి పోలీసులను ఆశ్రయించింది. దీంతో గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్‌లో నటుడు ధర్మ మహేశ్ మీద బిఎన్ఎస్ సెక్షన్ 85,115(2), 316(2),351(2), 352, సెక్షన్ 4 ఆఫ్ డిపి యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆక్రమణల భరతం

**నాలాపై కబ్జాల తొలగింపు**

**హైడ్రా చొరవతో మూడు కాలనీలకు తప్పిన ముంపు బెడద**

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలంలోని ఏవీబీపురంలో నాలా ఆక్రమణలను హైడ్రా సోమవారం తొలగించింది. పరికి చెరువు నుంచి కూకట్‌పల్లి నాలాలో కలిసిన దీని వెడల్పు 10 మీటర్లు కాగా 3 మీటర్లకు పైగా కబ్జాకు గురైంది. ఈ నాలాపైన రెండు షట్టర్లు వెలిశాయి. నాలానే కాకుండా.. మ్యాన్‌హోల్‌పైన కూడా నిర్మాణాలు చేపట్టారు.
ఇందులో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల విక్రయాలు, మరమ్మతులు చేస్తున్నారు. నాలా ఆక్రమణతో సాయిబాబాకాలనీ, హెచ్ ఏ ఎల్ కాలనీ, మైత్రినగర్‌లో వరద ముంచెత్తుతోంది. ఏమాత్రం వర్షం పడిన పై నుంచి వచ్చే వరద సాఫీగా సాగక.. తమ ప్రాంతాలు నీట మునుగుతున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో జలమండలి అధికారులు కూడా పరిశీలించారు. జలమండలి అధికారుల నివేదిక మేరకు హైడ్రా ఈ కూల్చివేతలు చేపట్టింది. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# నడ్డి విరగ్గొడుతున్న వడ్డీ

**ఆశపెట్టి కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు**

**పెట్టుబడుల పేరుతో భారీ మోసాలు**

**కస్టమర్లను ఆకర్షించడానికి మొదట్లో సక్రమంగా వడ్డీల చెల్లింపు**

**ఖజానా నిండిన తర్వాత బోర్డు తిప్పేస్తున్న అక్రమార్కులు**

**కేసులు నమోదవుతున్నా రికవరీ లేదంటూ బాధితుల ఆవేదన**

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నగరంలో రోజుకో కొత్త తరహా మోసం వెలుగుచూస్తోంది. రియల్ ఎస్టేట్, అధిక వడ్డీ, వ్యాపార సంస్థలలో భాగస్వామ్యం, షేర్లలో పెట్టుబడుల పేర్లతో ఆశ చూపి ప్రజల నుంచి కోట్ల రూపా యలు దండుకుంటున్నారు. పథకం ప్రకారం ప్రజల సొమ్మును కొల్లగొట్టడమే టార్గెట్‌గా కార్యాలయాలు నెలకొల్పడం.. తమ టార్గెట్ పూర్తయ్యాక బోర్డులు తిప్పేయడం నిత్యకృత్యంగా మారింది. మరికొందరు కేటుగాళ్లు తమ వ్యాపారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి యూట్యూబర్లతో ప్రచారం నిర్వహిస్తూ, వారు కూడా సంస్థలో పెట్టుబడులు పెట్టి భారీగా లాభాలు గడించినట్లు చూపించడంతో ప్రజలు కూడా నిజమేనని నమ్మి పెట్టుబడులు పెడుతున్నారు. కస్టమర్లను ఆకర్షించడానికి మొదట్లో వడ్డీలు సకాలంలో చెల్లించడంతో అధిక వడ్డీ వస్తుందనే ఆశతో వేలాదిమంది పెట్టుబడులు పెట్టి మోస పోతున్నారు. అత్యాశతో పెట్టుబడి పెట్టి అనంతరం మోస పోయామని గ్రహించిన బాధితులు చివరికి పోలీస్‌స్టేషన్ల ముందు క్యూ కడుతున్నారు.

**వేల కోట్ల దోపిడీ..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రతి సంవత్సరం కొన్ని వేల కోట్ల రూపాయల మోసాలు జరుగుతున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక నేరగాళ్లపై కేసులు నమోదవుతున్నా.. వారి నుంచి రికవరీ జరగడం లేదంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసులు నమోదు చేసి నిందితులను విచారిస్తున్న ఈవోడబ్ల్యూ(ఆర్థిక నేర విభాగం) పోలీసులు నిందితుల బినామీలపై దృష్టి సారించట్లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిందితులకు సహకరిస్తూ గతంలో సీసీఎస్‌లో పనిచేస్తున్న ఓ ఏసీపీ అక్రమాస్తుల కేసుల విషయంలో జైలుకు వెళ్లడం,. అదే సీసీఎస్‌లో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ముందే లంచం తీసుకుంటుండగా ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ)కి పట్టుబడిన విషయం తెలిసిందే.

**బయటకు రాని బినామీల వివరాలు..**

ఆర్థిక నేరాలకు పాల్పడుతూ వందల కోట్లు దోచుకుంటున్న కేటుగాళ్లు కొనుగోలు చేసిన అక్రమ ఆస్తులు, బినామీల వివరాలు మాత్రం బయటకు రావడం లేదు. కేవలం బాధితుల ఫిర్యాదు ఆధారంగా నిందితులపైనే తుతు మంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు



వెల్లువెత్తుతున్నాయి. వందల కోట్ల దోపిడీలకు పాల్పడిన నిందితుల నుంచి రికవరీ మాత్రం జర గడం లేదని బాధితులు వాపోతున్నారు. కేసులు, కోర్టులతో తమకు ఒరిగేదేమీ లేదని, డబ్బు రికవరీ చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.
మల్కాజిగిరి సైనిక్‌పురిలో నిందితులు పాన్యం దినేశ్, అతని భార్య కవిత 'సెల్ఫ్ బౌండ్ కోవర్కింగ్' పేరిట కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్, చిరువ్యాపారులను టార్గెట్ చేసుకొని బ్యాంక్ కంటే ఎక్కువ వడ్డీ ఇస్తామని నమ్మించి పెట్టుబడులు పెట్టించారు. కస్టమర్లను ఆకర్షించేందుకు మొదట్లో సక్రమంగా వడ్డీలు చెల్లించారు. ఇలా తమ మాయ మాటలతో నమ్మించి సుమారు 160 మంది బాధితుల నుంచి రూ. 20 కోట్లకు పైగా వసూలు చేసి పరారయ్యాడు. గ్రహించిన బాధితులు దినేష్ భార్య కవితను నిలదీయగా, తన భర్తతో విడాకులు కావాలని ఇటీవలే కోర్టులో అప్లై చేసినట్లు తెలిపింది. దీంతో బాధితులు కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# మూసీలో దూకి యువకుడి ఆత్మహత్య

**గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, డీఆర్‌ఎఫ్ సిబ్బంది**

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** చాదర్‌ఘాట్ బ్రిడ్జ్ వద్ద సోమవారం సాయంత్రం ఒక యువకుడు మూసీ నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు యువకుడు తన బైక్‌ను వంతెనపై గల ఫుట్‌పాత్‌పై పార్క్ చేసి, అకస్మాత్తుగా మూసీలోకి దూకినట్లు తెలిపారు. భారీ వర్షాల కారణంగా నదిలో వరద ఉధృతంగా ఉండటంతో దూకిన కొద్ది క్షణాల్లోనే యువ కుడు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. చాదర్‌ఘాట్ పోలీసులు, డీఆర్‌ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి.
కాగా, బ్రిడ్జిపై పార్క్ చేసిన టీఎస్ 11 ఎఫ్ఏ 4052 బైక్ నంబర్ ఆధారంగా యువకుడి పేరు కిరణ్‌గౌడ్‌గా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.
ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ప్రజావాణికి రావాల్సిందే

**అధికారులకు కలెక్టర్ హరిచందన ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రజావాణికి జిల్లా అధికారులందరూ హాజరై దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని తో కలసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక పాల్గొనాలని ఆమె సూచించారు. సోమవారం ప్రజావాణిలో 185 దరఖాస్తులు అందగా అందులో హౌసింగ్ శాఖ 130 (2బి.హెచ్.కె 13, ఇందిరమ్మ ఇండ్లు 117), పెన్షన్స్ 21, కలెక్టరేట్ సెక్షన్లు 10, ఆర్.డి.ఓ మరియు తహసిల్దార్ 02, ఇతర శాఖలు 22 కలవని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే వాట్సప్ ప్రజావాణి ద్వారా హైదరాబాద్ జిల్లాకు సంబంధించి 82 దరఖాస్తులు అందాయని వాటిలో 52 పరిష్కరించగా మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని ఆమె తెలిపారు.
అనంతరం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, కలెక్టరేట్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సంబంధిత శాఖ అధికారులు తాసిల్దారులతో సమీక్షి ంచారు. ప్రభుత్వ పాఠశాలలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవాన్ పలని, జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి, వివిధ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దరాఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన



ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మొగుళ్ల రాజిరెడ్డి, సతీష్‌కుమార్, కళ్లెం రాజ్‌రెడ్డి తదితరులు

# కారుణ్య నియామకాలు చేపట్టి న్యాయం చేయండి

**జలమండలి ఎండీకి ఎంప్లాయిస్ యూనియన్ వినతి**

**హైదరాబాద్, ఆగస్టు 18,ప్రభాతవార్త:** సంవత్సరాల కొద్దీ జాప్యంతో ఉన్న జలమండలిలో కారుణ్య నియామకాలు చేపట్టి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలనీ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సి. సతీష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హైదరాబాద్ వాటర్ వర్క్స్ సేవరేజ్ కంగర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కళ్లెం రాజ్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. ఈమేరకు సోమవారం అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో ఎండీ అశోక్ రెడ్డిను కలసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బోర్డులో కారుణ్య నియామకాలు చాల జాప్యం అవుతున్నాయని, సర్క్యులర్లలో సూచించిన విధంగా బాధిత కుటుంబానికి తక్షణ ఉపశమనం అందించడానికి దరఖాస్తు సమర్పించిన పది పని దినాలలోపు కారుణ్య నియామక ప్రతిపాదనను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, మరణించిన ఉద్యోగులపై ఆధారపడిన వారిని నియమించాలని నియామక అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మానవతా దృక్పథంతో కారుణ్య నియామకాల చేపట్టాలని కోరారు. అలాగే ఎన్.పి.ఎస ఉద్యోగులకు రిటైర్మెంట్ గ్రాజివిటీ డెత్ గ్రాజువిటీ వెంటనే అందజేయాలని కోరారు.
అదేవిధంగా అధిక పని చేసిన ఉద్యోగులకు ఓటి చెల్లించాలని, డైలీ వేజ్ ఉద్యోగులకు ఎస్ఎస్ఆర్ రేట్స్ ప్రకారం వేతనాలు చెల్లించి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేసారు. ఈసందర్భంగా మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి లో నిరంతరం ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వం మరియు మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అల్లి శ్రవాన్ కుమార్, ఎండీ. జాంగిర్, బి.దేవేందర్, సైద్ అక్తర్ అలీ, భూమయ్య సీతయ్య సి.రాజు, కె.ఆనంద్ రెడ్డి, అజయ్ నాథ్, లక్ష్మణ్ యాదవ్, గౌస్ పాషా, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**సికింద్రాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ నియోజక వర్గానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.10 లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ పంపిణీ చేశారు. సితాఫ లమండీ లోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్ర మంలో కార్పొరేటర్లు రాసురి సునీత, సామల హేమ, ఇతర నాయ కులు ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. ప్రజలు అత్యవసర సంద ర్భాల్లో తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

## ఉత్సాహభరితంగా తీజ్ పండుగ వేడుకలు

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 18, ప్రభాతవార్త :** కూకట్పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా బంజారా సాంప్రదాయ నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. పండుగ వాతావరణంతో విశ్వవిద్యాలయ ప్రాంగణం అంతా ఉత్సాహభరితంగా మారింది. ముఖ్య అతిథులుగా బీపీఎస్ రాష్ట్ర సభ్యులు ధరావత్ వినోద్ నాయక్, జెఎన్‌టియు సుల్తాన్‌పూర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహ నాయక్, బంజారా విద్యార్థి సంఘం యూనివర్సిటీ అధ్యక్షుడు దేవావత్ శ్రీకాంత్ నాయక్, కన్వీనర్ ధరావత్ సింహాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి నాయక్, ఉపాధ్యక్షులు గౌతమ్ నాయక్, జగన్, మహేష్, ప్రధాన కార్యదర్శి సాయి కిరణ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సత్కార కార్యక్రమంలో రోజాదేవి

## కాలనీలలో సమస్యలకు శాశ్వత పరిష్కారం

### కార్పొరేటర్ రోజాదేవి భరోసా

**వివేకానంద నగర్ కాలనీ, ఆగస్టు 18, ప్రభాతవార్త:** కాలనీలలో ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు తెలిపారు. సోమవారం కొత్తగా ఏర్పడిన వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పెండింగ్ పనులను పూర్తిచేస్తూ ప్రజా అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, రాములు సాగర్, రామ్ సాగర్, నర్సింగ్ రావు, సత్యనారాయణ, అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి అనిల్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న జాంగ్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుగిడి అనూప్ కుమార్

## నీలకంఠేశ్వరునికి వైభవంగా రుద్రాభిషేకం

**మెహిదీపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :** కార్వాన్ పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కేసరి హనుమాన్ స్ట్రీట్‌లో కొలువుదీరిన శ్రీ నీలకంఠ స్వామి దేవాలయానికి భక్తులు ఉదయం నుంచే బారులు తీరి నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్ జాంగ్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం 55వ శ్రావణ సోమవారోత్సవములను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర జాంగ్ర సంఘం అధ్యక్షులు బుగిడి అనుప్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పొట్ల రామస్వామి, జాంగ్ర సంఘం ప్రతినిధులు దేవరకొండ వెంకటేష్, శ్యాం లింగం, శ్రీనివాస్, రాఘవేందర్ మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హవనం పూజలో పాల్గొన్న ప్రతినిధులు

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**మెహిదీపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :** కృష్ణాష్టమి వేడుకలను గుడిమల్కాపూర్ లోని శ్రీకృష్ణ భవన్‌లో కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షులు బోడి అశోక్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు అవధూత శర్మ చేతుల మీదుగా హవనం, గోపూజ, జెండా వందనం, శ్రీకృష్ణ డోలారోహణం వంటి కార్యక్రమాలతో పాటు ప్రసాద వితరణ, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యాదవ విద్యార్థిని విద్యార్థులకు పదవ తరగతి నుంచి పీజీ వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులను కూడా అందజేశామని వివరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బోడి అన్ను యాదవ్, సంఘం ప్రతినిధులు జి.సందేశ్ యాదవ్, ప్రేమ్ కుమార్ యాదవ్, రాజగోపాల్, బోడి ప్రవీణ్ కుమార్ యాదవ్, అరవింద్ యాదవ్‌లు పాల్గొన్నారు.



## పోచమ్మ తల్లి చీరలు పంపిణీ

**మెహిదీపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :** గుడిమల్కాపూర్ డివిజన్ బాలాజీ నగర్ లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ అమ్మవారి చీరలను సోమవారం ఆలయ చైర్మన్ వై. అనిల్ చారి ఆధ్వర్యంలో మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సెక్రటరీ పి.రాజు కుమార్, గున్నాల రంగారెడ్డి, నరసింహారెడ్డి, రంగారెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్ చారి, చెంచయ్య, రాము, రాకేష్, మహేష్

### పాపన్నగౌడ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం

# సముచిత గౌరవం ఇస్తుంది

### పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత గౌరవం ఇస్తుందని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. సోమవారం అంబర్‌పేట గౌడ సంఘం ప్రాంగణంలో సర్థార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి జాతీయ వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సర్థార్ పాపన్నగౌడ్ విగ్రహానికి పలువురు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ భారత తొలి తెలుగు విప్లవ వీరుడు, బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ చరిత్ర, స్ఫూర్తి, ఖిలాషాపూర్ కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మన్‌గౌడ్, జె.సత్తిబాబు గౌడ్, కె.అంజన్‌దాస్‌గౌడ్, అంబర్‌పేట గౌడ సంఘం కమిటీ అధ్యక్షుడు పి.గిరిధర్‌గౌడ్, చైర్మన్ బి.రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీహరి గౌడ్, బి.మల్లిఖార్జున్‌గౌడ్, ఆర్.శ్రీధర్‌గౌడ్, ఎం.సతీష్‌గౌడ్, కోశాధికారి సి.రమణగౌడ్, జాయింట్ సెక్రటరీలు పి.వెంకటేష్ గౌడ్, ఆర్.ప్రదీప్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి.మహేష్‌గౌడ్, ఎం.రోహిత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుపునూరి కృష్ణగౌడ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గౌడ్‌లు సంఘటిత శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు.

**కెపిహెచ్‌బి కాలనీ:** కూకట్పల్లిలోని పాపన్న గౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

**పాపన్న ఆశయాల సాధనకు కలిసి కృషి చేద్దాం**

**ముషీరాబాద్ :** సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు అందరం కలసి కృషి చేద్దామని గీత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దూడల శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని కవాడిగూడ గౌడ సంఘం కార్యాలయంలో సంఘం నాయకుల మొరిగడి నవీన్‌గౌడ్, బి.కృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షులు సానెం హరీస్‌గౌడ్‌తో కలసి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్డులో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుచేయటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూమి పూజ చేయటం అభినంద నీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ గౌడ సంఘం సలహాదారులు గర్వందుల అంజయ్యగౌడ్, నాయ కులు ప్రతాప్‌గౌడ్, మద్దెల చంద్రయ్యగౌడ్, ఎల్.సత్యనారాయణ, పబ్బతి ప్రవీణ్‌గౌడ్, అరుణ్‌గౌడ్, జహంగీర్, వెంకటేష్, ఉదయ్, రాజు, మల్లేష్, శ్రీనివాస్, బి.శివ పాల్గొన్నారు.

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సర్వాయి పాపన్న చిత్ర పటానికి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, ఎన్.జగదీష్ గౌడ్, చంద్రమోహన్‌గౌడ్, కిరణ్, వెంకటేష్, ప్రదీప్‌గౌడ్, శంకర్‌గౌడ్, సుక్రవేది, సత్తన్న, రవిగౌడ్ పాల్గొన్నారు.

**మెహిదీపట్నం:** గుడిమల్కాపూర్ డివిజన్ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కార్వాన్ బి.సి ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు జీవన్ సింగ్, బండారి వెంకటేష్, బిజెపి నేతలు దేవర శ్రీనివాస్ కట్ల అశోక్, కాంగ్రెస్ నేత నాగారం వేణు గౌడ్‌లు పాలొన్నారు.

**అడ్డగుట్ట :** గొప్ప పోరాట యోధుడు సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మాజీ మంత్రి మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా బోయినపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కంటోన్మెంట్ డిపో గౌడ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యాకరకమంలో గౌడ సంఘం నేతలు జీకే మూర్తిగౌడ్, పి.ఆంజనేయులుగౌడ్, డి.నరహరి గౌడ్ తదితరులు నివాళులర్పించారు.

**బహుజన ధీరత్వానికి ప్రతీక పాపన్న గౌడ్ : సురేష్ రెడ్డి**

**జీడిమెట్ల :** సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్‌లో గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో భాగంగా పాపన్న విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించిన సురేష్ రెడ్డి. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతు పీడిత జనుల కోసం, బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న అని అన్నారు. నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పాపన్న గౌడ్ తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని అన్నారు. సామాజిక, రాజకీయ సమానత కోసం కృషి చేసిన బహుజన వీరుడు సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే గత కేసీఆర్ ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. సామాజిక విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గొప్పతనాన్ని స్మరించుకుంటూ అందరు అతని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ సంఘ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న విహెచ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గీత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు



గుడిమల్కాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నేతలు



నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సురేష్ రెడ్డి



పాపన్నగౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



పాపన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నిరంజన్‌రెడ్డి తదితరులు

**బహుజనుల రాజ్యాధికారం పోరాడిన ధీరుడు**

**కంటోన్మెంట్ :** బహుజనులకు కూడా రాజ్యాధికారం ఉండాలని పోరాడి సాధించిన ధీరుడు సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి సందర్భంగా బోయిన్‌పల్లి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రాంతంలో ఛత్రపతీ శివాజీ ,దక్షిణాదిలో సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ మెగలులపై దండెత్తి రాజ్యాధికారాన్ని సాధించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసారు. 350ఏళ్ల క్రితమే బహుజనుల కోసం పోరాటం చేసి సమాన్యులకు సంపదను పంచిన వీరుడని ఒక సామాన్య వక్తి ఎలాంటి ఉన్నత శిఖరాలకు అయినా చేరుకోవచ్చని నిరూపించిన యోధుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులతో పాటు కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రశిడెంట్ జంపన ప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, మారుతిగౌడ్, బల్వంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**చిక్కడపల్లి :** బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పివి.నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బడుగు బలహీన వర్గాలను ఐక్యం చేసి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన సర్వాయి పాపన్న స్ఫూర్తితో ఆయన ఆశయాన్ని సాధించడానికి ప్రతీ ఒక్కరు కంకణబద్ధులు కావాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న అట్టడుగు వర్గాలను ఐక్యం చేసి రాజ్యాధికారాన్ని సాధించడంలో జయప్రదం కాగలిగాడని కొనియాడారు. ఆయన లక్ష్యాలు ఆశయాలు నేటితరం అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ వి నాగభూషణం పార్కు మాజీ ప్రెసిడెంట్ సలిపెల రమేష్ రెడ్డి వాకర్స్ మిత్రులు టి స్కైలాబ్ బాబు, సునీల్, కృష్ణ మహేందర్, రమేష్ రెడ్డి, భాస్కర్, వెంకట్ రెడ్డి ,జగన్, సీతారాం రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్‌కే ) సంయుక్తంగా నిర్వహించిన పాపన్న జయంతిని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో టిపిఎస్‌కెలో భూపతి వెంకటేశ్వర్లు అద్యక్షతన ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ బహుజన వీరుడుగా పోరాటయోధుడిగా పన్నులకు వ్యతిరేకంగా 12 మంది సైన్యంతో పోరాటాన్ని ప్రారంభించి 12 వేల సైనిక శక్తిని పెంచిన పరిపాలన దక్షుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు, గౌడ/వృత్తి సంఘాల అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరులో ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటి మీట్

**సైదాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటి మీట్..2025ను సెప్టెంబరు 9వ తేది నుండి 11వ తేదీ వరకు ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణా స్టేట్ పోలీస్ అకాడమిలో నిర్వహించ నున్నారు. సికాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన లోగో, వెబ్ సైట్‌ను జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు 22 రాష్ట్రాలు డ్యూటీ మీట్‌లో పాల్గొనడానికి సంసిద్ధత తెలియజేశాయని, వీటిలో 13 రాష్ట్రాల నుండి పాల్గొనే వారి పేర్లు కూడా అందాయని, దేశవ్యాప్తంగా మొత్తం 1200లకు పైగా డ్యూటి మీట్‌లో పాల్గొననున్నట్లు జైళ్ల శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజిలు వై.రాజేష్, ఎన్.మురళిబాబు, డిఐజిలు డి.శ్రీనివాస్, ఎం.సంపత్, సూపరింటెండెంట్‌లు, డిప్యూటి సూపరింటెండెంట్‌లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు తదితరులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న జైళ్ల డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర

## ప్రజావాణికి అధికారుల డుమ్మా : స్థానికుల ఆగ్రహం

**పేట్ బషీరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్‌లోని ఐడిపిఎల్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు ఎవరూ లేకపోవడంతో తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరగడం జరిగింది. ఈ సందర్భంగా ఎం.ఎన్. రెడ్డి కాలనీ ఫేస్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంపత్ గౌడ్ మాట్లాడుతూ ప్రజావాణి ప్రజల సమస్యలు తీర్చడంలో విఫలం చెందిందని, అధికారులు మొద్దు నిద్ర విడడం లేదని మండిపడ్డారు. ప్రజావాణికి తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో లేరని, ఇటువంటి ప్రజావాణి నిర్వహించడం కన్నా ఆపడం మంచిదని ప్రజలు మండిపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి**

**చార్మినార్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చాంద్రాయణగుట్ట పూల్‌బాగ్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్




ప్రజావాణిలో పాల్గొన్న జిహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్

## రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వ్యాపారి మృతి

**చార్మినార్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసి బస్సు ఢీ కొట్టడంతో ఓ వ్యాపారి మృతి చెందిన సంఘటన చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం ప్రకారం పాతబస్తీ వట్టెపల్లి ప్రాంతానికి చెందిన మహ్మద్ మునావర్ (45) వృత్తి రీత్యా నగరంలోని పుట్‌ఫాత్‌లపై చీరలు వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మహ్మద్ మునావర్ సిటీ కళాశాల రహదారి నుంచి పెట్లాబుర్జు వెళుతున్నాడు. అదే సమయంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు పెట్లాబుర్జు నుంచి సిటీ కళాశాల వైపు వెళుతున్నది. అదుపు తప్పిన ఆర్టీసి బస్సు నడిచి వెళ్తున్న మునావర్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన మునావర్‌ను పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మెనావర్ మృతి చెందినట్లు మృతి చెందినట్లు ధృవీకరించారు. ప్రమాదానికి కారకుడైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చిన్నారి కళాకారులతో రవికుమార్, కిరణ్మయి, సత్యనారాయణ, పద్మకళ్యాణ్ తదితర అతిథులు

## చిన్నారుల ఆసక్తికి పదునుపెట్టేందుకే బాలోత్సవ్

**నాంపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త :** పిల్లల్లోని ఆసక్తి, అనురక్తి, ప్రతిభ సృజనాత్మకతలకు పదును పెట్టేందుకు ఒక వేదికగా బాలోత్సవ్ ఉపయుక్తంగా ఉంటుందని ఇన్‌మైండ్ హెచ్‌ఆర్ డా. వంగిపురపు రవికుమార్ అన్నారు. సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో జరిగిన బాలోత్సవ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన రవికుమార్ సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు డా. కిరణ్మయితో కలిసి జ్యోతిప్రకాసనంచేసి వేడుకలను ప్రారంభించారు. పిల్లల్లో వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొం దించడానికి వేదిక తోడ్పతుందని అభిప్రాయపడ్డారు. సంచలన సంస్థ ఇలాంటి ఎనోన విలక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ కళలు, కళాకారులను ప్రోత్సహిం చడం శ్లాఘనీయమన్నారు. డా. కిరణ్మయి గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి తదితర నృత్యప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డా. లయన్ సత్యనారాయణ, సంస్థ అధ్యక్షురాలు పద్మకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న యాగ్నికులు శ్రీహరి ఆచార్యులు

## రేణుక ఎల్లమ్మ తల్లి గుడి గోపుర నిర్మాణానికి శంకుస్థాపన

**మూసాపేట్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి దీనబంధు కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి గుడి గోపుర నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ప్రముఖ యాగ్నికులు శ్రీహరి ఆచార్యుల చేతుల మీదుగా వేదమంత్రోచ్చారణల నడుమ, శాస్త్రోక్త పద్ధతిలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, సంఘ అధ్యక్షుడు మహేందర్ నాయక్, కోశాధికారి ఆవుల రాజు, గిరి, మోహన్ రావు, వెంకటేశ్వర శెట్టి, బాలు, వెంకటయ్య, గణేష్, బసవరాజు, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శంకుస్థాపన వేడుకలను విజయవంతం చేశారు. గోపుర నిర్మాణ ప్రారంభం భక్తులకు ఆనందాన్ని కలిగించిందని, ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలనే అభిప్రాయం వ్యక్తమైంది.

## ఎంపిడిఒ భార్య ఆత్మహత్య

**తార్నాక, ఆగస్టు 18 ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో ఎంపిడివో బార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. శంకర్‌పల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకయ్య గౌడ్, తన బార్య ఉషా (37), తన ఇద్దరు పిల్లలతో కలిసి హబ్సిగూడ స్ట్రీట్ నెం. 4లో నివాసముంటున్నారు. ఇదిలా ఉండగా వీరు కుటుంబ కల హాలతో తరుచు గొడవపడుతున్నారు. ఈ క్రమంలో తీవ్ర మన స్థాపానికి గురైన ఉషా ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

## సికింద్రాబాద్ కోర్టుకు మందకృష్ణ హాజరు

**కంటోన్మెంట్ ఆగస్టు 18, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ కోర్టుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ హాజరయ్యారు. మంద కృష్ణ మాదిగ రాక ను తెల్సు కున్న పలువురు ఆయన్ను కోర్టు ప్రాంగణంలో కల్సు కున్నారు. మంద కృష్ణను కల్సి న వారిలో ఎమ్మార్పీఎస్ నేతలు రాగటి సత్యం మాదిగ, ఇటుక శ్రీకిషన్ మాదిగ, న్యాయవాదులు ఉన్నారు.

